## చౌడమ్మగుట్ట నుండి యాదగిరిగుట్ట వరకు పాదయాత్ర

**షాద్‌నగర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
షాద్‌నగర్ నియోజకవర్గంలో బిజెపి ఆధ్వర్యంలో సోలీపూర్‌గ్రామంలోని చౌడమ్మగుట్ట ఆంజనేయ స్వామి దేవాలయంనుండి యాదగిరిగుట్టవరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు బిజెపినాయకులు తెలిపారు. నేటిసాయంత్రం 5గంటల పాదయాత్రగా బయల్దేరి ఈనెల 12వ తేదీన యాదగిరిగుట్టకు చేరుకుంటామని వారు పేర్కొన్నారు. భారతప్రధానిగా నరేంద్రమోడీ మూడవసారి బాధ్యతలు చేపట్టిన సందర్భంగా, పాలమూరు ఎంపిగా మొదటిసారి మహిళా ఎంపి డి.కె.అరుణ గెలిచినందుకు ఈపాదయాత్ర చేపట్టినట్లు తెలిపారు. ప్రజలభూములు అమ్ముతూ కాంగ్రెస్‌ప్రభుత్వం దళిత, గిరిజన, బిసి పేదలసంక్షేమానికి సంబంధించిన ఆరుపథకాలను అమలుచేయకుండా ప్రజలను దోచుకుంటుందని, ఈ దుర్వ్యవస్థపై ప్రజల్లో చైతన్యంపెంచి, ఉద్యమజ్వాల రగిలించేందుకు ఈపాదయాత్ర చేపట్టామని, పాదయాత్రలోపాల్గొనేందుకు ఆసక్తి ఉన్నవారు ముందుగా తమపేర్లు నమోదుచేసుకోవాలని కోరారు.



# రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
# వార్త

## రెండు ద్విచక్ర వాహనాలు ఢీ.. ఒకరు మృతి.. మరొకరికి గాయాలు

**ధారూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాల ఢీకొని ఒకరుమృతిచెందగా మరొకరు గాయాలపాలైన సంఘటన మండలపరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ అనిత తెలిపినవివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని రుద్రారంగ్రామానికిచెందిన కంది శ్రీనివాస్ తనబైకుపై పనినిమిత్తం వికారాబాద్‌వెళ్తున్నాడు. అదేసమయంలో గట్టేపల్లిగ్రామానికిచెందిన చింతకింది నర్సింలు వికారాబాద్ వైపు నుంచి స్వగ్రామానికి వెళ్తుండగా, ఏబ్బ నూరుచెరువువద్ద 2ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికిచేరుకున్నారు. అప్పటికే శ్రీనివాస్‌కు తీవ్రగాయాలు, నర్సింలుకు స్వల్పగాయాలు కావడంతో పోలీసులు వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. శ్రీనివాస్‌పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైనచికిత్సకోసం హైదరాబాద్ గాంధీఆసుపత్రికి తరలించాలని వైద్యులుతెలిపారు. హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో శ్రీనివాస్ మృతిచెందాడు. మృతునిసోదరుని ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి
-జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
ప్రజాఫిర్యాదులు పెండింగ్ ఉంచకుండా త్వరితగతిన పరిష్కరించేవిధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశము హాలు నందు ఏర్పాటుచేసిన ప్రజావాణి సందర్భంగా జిల్లాలో వివిధప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి 120 ఫిర్యాదులు స్వీకరించారు. వాటిలో ధరణికి సంబంధించిన భూసమస్యలు, ఆసరా పింఛన్లు, ఇరిగేషన్, భూసర్వే, గ్రామ పంచాయతీ, ఇతరశాఖలకు సంబంధించిన సమస్యలపై దరఖాస్తులు సమర్పించారని కలెక్టర్ తెలిపారు. మండలాలకుసంబంధించిన పలుగ్రామాల ప్రజలు ఇచ్చిన భూసమస్యలపై ఫిర్యాదులను పరిశీలించారు. ఆన్లైన్ రికార్డు చెక్‌చేసి, ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తిచేసి రిపోర్ట్ పంపించాలని, ప్రజావాణి ద్వారా వచ్చిన ఫిర్యాదులు పెండింగ్ ఉంచకుండా ఎప్పటికప్పుడు పూర్తిచేయాలనీ అధికారులను ఆదేశించారు. భూసమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు సంబంధిత అధికారులకుపంపి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఫిర్యాదు దారులకు హామీ ఇచ్చారు. ఈసమావేశంలో జిల్లా అదనపుకలెక్టర్‌లు లింగ్యానాయక్, సుధీర్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు పకడ్బందీ చర్యలు
-జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

**వికారాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా 2024-25 రబి సీజన్‌కు సంబంధించిన వరి కొనుగోలుకేంద్రాల ఏర్పాటుకు పకడ్బందీచర్యలు చేపట్టాలని జిల్లా అదనపుకలెక్టర్ లింగ్యానాయక్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో తనఛాంబర్‌నందు రబీసీజన్ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద చేపట్టాల్సిన ఏర్పాట్లపై సమావేశము నిర్వహించారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ, సిఎంఆర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈనెల 15నుండి ప్రారంభించేందుకు సిద్ధంగా ఉండాలని, వరికొనుగోళ్ళపై రైతులకు పూర్తి అవగాహన కల్పించాలన్నారు. రబీ వరి కొనుగోలు ప్రణాళికప్రకారం ముందస్తుచర్యలు తీసుకోవాలని, మిల్లులకు తేమలేకుండా నాణ్యమైన వరిధాన్యాన్ని తరలించేవిధంగా రైతులు కేంద్రాలకు తీసుకురావాలని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా చూసుకోవలసిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. జిల్లాలో 128 వరి కొనుగోలుకేంద్రాలు ఏర్పాటుచేస్తున్నామని, 11కేంద్రాలు సన్నాలు, 117 దొడ్డురకాలు కొనుగోలుకు సిద్ధంగా ఉండాలన్నారు. సుమారుగా 1,90,000 మెట్రిక్ టన్నుల దొడ్డురకం వరి 10,000 మెట్రిక్ టన్నుల సన్నరకం వరి వస్తుందని, ఏప్రిల్ చివరివారము వరకు వరి వచ్చే సూచనలు ఉన్నందున ముందస్తుగానే సెంటర్లు ఓపెన్ చేస్తునట్లు తెలిపారు. ఐకెపిసెంటర్లకు మొదటిప్రాధాన్యత ఇవ్వడం జరిగితుందని తెలిపారు. ప్రతి కొనుగోలుకేంద్రందగ్గర ఫ్లెక్సీ ఏర్పాటు చేసి ధరలు, తేమశాతం తదితర వివరాలు ఏర్పాటు చేయాలన్నారు. కేంద్రం దగ్గర క్లీనింగ్ మిషన్, తేమశాతం కొలిచే పరికరాలు, త్రాగునీరు ఇతర ఏర్పాట్లు చేయాలన్నారు. గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. టార్పాలిన్లు, ప్యాడిక్లీనర్లు, తేమయంత్రాలు, తూకంయంత్రాలు అందుబాటులో ఉంచాలని పేర్కొన్నారు. రైతులు వారి ఆధార్‌కార్డును నమోదు చేయాలని, చెక్ పోస్టల దగ్గర రెవెన్యూ, పోలీస్, సివిల్‌సప్లై సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. ప్రణాళిక ప్రకారం టోకెన్లు ఇచ్చి సెంటర్‌లకు ధాన్యం వచ్చేవిధంగా చూడాలని రైతులకు ఎలాంటి నష్టం కలుగకుండా వరి కొనుగోలు జరగాలని అధికారులకు సూచించారు. రవాణా విషయంలో రైతులు నష్టపోకుండా తగుచర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ధాన్యండెలివరీపై రైస్‌మిల్లర్లతో సమావేశమయ్యారు. నాణ్యమైన సిఎంఆర్‌రైసు ను అందజేయాలని రైస్‌మిల్లర్లకు సూచించారు. మిల్లర్లకు నిర్దేశించిన లక్ష్యాలమేరకు బియ్యాన్ని అందజేయాలన్నారు. సన్నబియ్యంతోపాటుగా 2023-24 సంవత్సరం రబీకిసంబంధించిన బియ్యాన్ని కూడా అందజేయాలని మిల్లర్లకు సూచించారు. ఈసమావేశంలో డి.యస్.ఓ మోహన్‌బాబు, డి.యం.సివిల్ సప్లై వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి మోహన్‌రెడ్డి, మార్కెటింగ్ అధికారి సారంగపాణి, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ గుప్తా, బాలేశ్వర్‌గుప్తా, తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వభూమి కబ్జాచేస్తే చర్యలు తప్పవు



కడీలను తొలగిస్తున్న దృశ్యం

**మర్పల్లి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
ప్రభుత్వ భూములను కబ్జాచేస్తే ఎంతటి వారినైనా వదిలేదిలేదని తహసీల్దార్ మునీరొద్దీన్ అన్నారు. మండలలలోని పట్లూర్ శివారులో కొందరు అక్రమార్కులు ప్రభుత్వ భూమిని కబ్జాచేసి ఏకంగా ఫెన్సింగ్‌వేయడంతో విషయంతెలుసుకున్న తహసీల్దార్ సర్వేయర్‌చేత సర్వే చేయించారు. అది ప్రభుత్వ భూమియని తేలడంతో సోమవారం ఆయన జెసిబిలతో కంచును తొలగించారు. అనంతరం వారు మాట్లాడుతూ మండలంలోని ఏగ్రామంలోనైనా ప్రభుత్వ భూమిని కబ్జా చేసినట్లైతే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన తెలిపారు. కొందరు అక్రమార్కులు ప్రభుత్వ భూములను కబ్జా చేసి అక్రమంగా కంచులు వేసి తమకుతాము కొనుగోలు చేసినట్టు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. తప్పులు చేయడం, విక్రయీగడం, అలాంటివారు ఎవ్వరైనా వదిలేది లేదన్నారు.

## ఆంజనేయస్వామికి మకరతోరణం ఏర్పాటు..

**దుద్యాల్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
మండలకేంద్రంలోని ఆంజనేయస్వామికి మకరతోరణం సోమవారం ఏర్పాటుచేశారు. దుద్యాల గ్రామానికి చెందిన అమంతగిరి నారాయణ కుటుంబసభ్యులు రూ.32 వేల ఖర్చుతో స్వామివారికి ఇత్తడి మకరతోరణం అందజేశారు. గ్రామాల్లో ఆలయాలు అభివృద్ధి చెందాలంటే అందరి సహకారం అవసరమని చెప్పుకొచ్చారు.

# ప్రభుత్వ స్థలాలు అన్నీ అన్యాక్రాంతం

**మున్సిపల్ అధికారులు, రెవెన్యూ అధికారుల అండతో ప్రభుత్వస్థలాల్లో నిర్మాణాలు, అధికారులతీరుపై అసహనం వ్యక్తంచేస్తున్న కాంగ్రెస్ నాయకులు**



చౌదరిగూడలోని ప్రభుత్వస్థలం సర్వేనెంబరు 867లో నిర్మిస్తున్న ఇంటి దృశ్యం



కొర్రెముల రెవెన్యూ గ్రామం సర్వేనెంబరు 869లో రాత్రికిరాత్రి వెలిసిన ఇంటి నిర్మాణం

**ఘట్‌కేసర్ రూరల్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
ప్రభుత్వ భూములను రక్షించాల్సిన అధికారులే వాటికి అనుమతులులిస్తూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నవైనం పోచారం మున్సిపాలిటీలో చోటుచేసుకుంది. ప్రభుత్వ భూముల పరిరక్షణకు నిలవాల్సిన రెవెన్యూ అధికారులు తమకు అందిన కాడికి దండుకుంటూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. దీంతో ఇటుమున్సిపల్ అధికారులు, అటు రెవెన్యూ అధికారులు రియల్‌వ్యాపారస్థులు, రాజకీయ నాయకులతో మిలాఖాత్ అయి ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేస్తున్నారు. గతంలో ఎన్నాడూ లేనివిధంగా మున్సిపల్ అధికారులు ప్రభుత్వ నిషేధజాబితాలో ఉన్నభూములకు అనుమతులిస్తున్నారు. ఇదేమిటని ప్రశ్నిస్తే ఈ విషయం తనకు తెలియదని టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ ఇచ్చారని మున్సిపల్ కమిషనర్ జవాబిచ్చి అదేమన్నా పెద్దవిషయమా అన్నట్టు దాటవేస్తున్నారు. ఈవిషయం తనకు సంబంధంలేదని టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్‌దేనని కమిషనర్ దాటవేస్తున్నారు. ఇదే విషయమై పోచారం మున్సిపల్ టిపిఓను సంప్రతిస్తే చిక్కడు దొరకడు అన్న తరహాలో ఫోన్ చేసినా, మెసేజ్ పెట్టినా సమాధానం ఇవ్వరు. ఆఫీస్‌కు వెళ్లి కలిసే ప్రయత్నం చేస్తే ఆఫీస్‌కు రారు. తనకు మరోమున్సిపల్‌బాధ్యతలు చూడాల్సి ఉన్నందున తనకు అనుకూలమైనవారికే కలవడానికి అనుమతిస్తారు. మిగతావారికి నోఎంట్రీ అన్న వ్యవహారంలాగా వ్యవహరిస్తారు. పోచారం మున్సిపల్‌లో విచ్చలవిడిగా నిబంధనలకు విరుద్ధంగా అక్రమనిర్మాణాలు జరుగుతున్నా టిపిఓ పట్టించుకోరు. ఈవిషయమై రెవెన్యూ అధికారులను సంప్రతిస్తే తమకు తెలియనట్టు వ్యవహరిస్తున్నారు. ఇదంతా ఘట్‌కేసర్ మండలం కొర్రెముల రెవెన్యూ చౌదరిగూడ పరిధిలోని సర్వేనెంబరు 867, 869లోని భూముల్లో జరుగుతోంది. పోచారం మున్సిపల్‌పరిధిలోకి వచ్చే చౌదరిగూడలోని సర్వే నెంబరు 867లోని భూమి ప్రభుత్వ స్థలం. ఈసర్వేనెంబరులో దాదాపు18ఎకరాల 26 గుంటలభూమి ఉండేది. దీనిని అధికారులు పలువురు రైతులకు అసైన్‌కింద పంపిణీచేశారు. అసైన్డ్ దారులు భూమిని తమకు ఇచ్చిన హక్కును దుర్వినియోగం చేయగా ప్రభుత్వం గతంలోనే దాదాపు 10ఎకరాల 33గుంటల భూమిని తిరిగి పిఓటి యాక్టు ప్రకారం స్వాధీనం చేసుకుంది. పిఓటి యాక్టు కింద స్వాధీనం చేసుకుని రక్షించాల్సిన భూమిపై పర్యవేక్షణాలోపంతో దశలవారీగా అక్రమణకు గురౌతుంది. ఇటీవల వందగజాల స్థలానికి పోచారం మున్సిపల్ అధికారులు ఇల్లు నిర్మించుకోవడానికి అనుమతులు ఇచ్చినట్లు తెలుస్తోంది. ప్రభుత్వ రికార్డుల్లో సదరు సర్వేనెంబరు భూమి నిషేధితజాబితాలో ఉన్న మున్సిపల్ అధికారులు ఇంటినిర్మాణానికి అనుమతులు ఇవ్వడం మున్సిపల్ అధికారుల అవినీతి వ్యవహారం ఏపాటిదో చెప్పకనే చెపుతుంది. మున్సిపల్‌లో ఇప్పటికే ఎన్నో భవంతులు అనుమతులు లేకుండా నిర్మాణాలతో పాటు తీసుకున్న అనుమతి ఒక్కటి అయితే నిర్మాణాలు అంతకుమించి అవుతున్నాయి. అంతేగాక పోచారంమున్సిపల్‌లో విచ్చలవిడిగా షెడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. షెడ్ల నిర్మాణానికి అనుమతిచ్చే అవసరం లేకపోవడంతో నిర్మాణదారులతో కుమ్మక్కైన అధికారులు లక్షల్లో వసూళ్లకు పాల్పడుతూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారు. ప్రభుత్వస్థలాలను కాపాడాల్సిన అధికారులే వాటికి అనుమతులిస్తుండటంతో ఇక ప్రభుత్వ ఆస్తులను ఎవరురక్షిస్తారని స్థానికులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

**కొర్రెముల రెవెన్యూ సర్వేనెంబరు 869లో..**
కొర్రెముల రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబరు 869లో దాదాపు 11.33గుంటల ప్రభుత్వ స్థలం ఉంది. దీనిలో కొందరికి గతంలో పట్టాలివ్వగా కొందరు వీకర్‌సెక్షన్‌కాలనీ పేరిట ఇల్లు నిర్మించుకున్నారు. ఇదే ఇంళ్లను ఆసరాగాచేసుకుని కొందరు రియల్ వ్యాపారస్థులు ఇల్లు నిర్మించి ఇస్తే కొంత రేటు మాట్లాడుకుని రెవెన్యూ అధికారులకు ఇంతని రేటు మాట్లాడుకుని ఇంటి నిర్మాణాలు చేపట్టి విక్రయిస్తున్నారు. ఇలా ఒక్కొక్కటి ఇళ్లు నిర్మిస్తూ అధికారుల అండతో బిల్డర్స్ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఇదేమన్నా అధికారులకు తెలియదా అంటే అదేంలేదు. అంతా తెలుసు తమని అడిగేవారు ఎవరని అధికారులు ధీమాగా ఉంటున్నారు.

**ఫిర్యాదుచేసినా పట్టించుకోని అధికారులు..**
కొర్రెముల రెవెన్యూ పరిధిలోని సర్వేనెంబరు 867, 869లలోని అక్రమాలపై స్థానికులు స్థానిక తహసీల్దార్, జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేసినా అధికారుల్లో చలనంలేదు. పేరుకే ప్రభుత్వభూములను రక్షిస్తామన్న ప్రకటనలు చేస్తారు. వాటిరక్షణకు చర్యలు తీసుకోవడం లేదని స్థానిక ఫిర్యాదుదారులు వాపోతున్నారు. 867 సర్వేనెంబరులో వందగజాలస్థలం ప్రభుత్వభూమి అని తెలిసినా మున్సిపల్ అధికారులు దాదాపు లక్షాకుపైగా రూపాయలనగదుతీసుకుని అనుమతులిచ్చారు. అక్రమార్కులు తమకు మున్సిపల్ అధికారులే ఇళ్లు నిర్మించుకుని పర్మిషన్ ఇచ్చారని మీరు ఎవరు మాదితప్పని అనడానికి అని ఎదురుదాడి చేస్తున్నారు. తమను అడిగేవారేలేరని ప్రశ్నించేవారే లేరని ఇష్టానుసారంగా అనుమతులు ఇవ్వడాన్ని ఎలా సమర్థించాలో తమకు అర్థం కావడం లేదని స్థానికులు అంటున్నారు. ఓవైపు రాష్ట్రప్రభుత్వం హైడ్రావంటి ప్రతిష్ఠాత్మక సంస్థను ఏర్పాటుచేసి అన్ని అనుమతులు తీసుకున్నావాటికి నిబంధనలు ఉల్లఘించిన నిర్మాణాలను విచారణ జరిపి కూల్చివేస్తుండగా ఇక్కడ ఏకంగా ప్రభుత్వ భూమి అని తెలిసినా అధికారులు తమకాసుల కక్కుర్తికొరకు కాసులు వస్తే చాలు ఏదైనా పర్మిషన్ ఇస్తామని ఏమైనాచేసుకోండి ఇక్కడ ఉన్నంతకాలం పనిచేసినంతా కాలం తమ జేబులు నిండితే చాలు అన్నట్టు మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్నారు. మరో వైపు రెవెన్యూ అధికారులు తమ వాటా తమకు వస్తే చాలు, మరోవైపు ఎవరు తమ అక్రమాలను ప్రశ్నించకుండా ఉంటే మరీ మంచిది అన్నట్టు వ్యవహరిస్తున్నారు. గతంలో ఫిర్యాదు వస్తే పట్టించుకునే అధికారులు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అధికారులు తమకు అందినకాడికి దండుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఉందని జనాల్లో టాక్ మొదలైంది. ప్రజల్లో కాంగ్రెస్‌ప్రభుత్వ పనితీరుపట్ల వ్యతిరేకతకు తోడు అధికారుల అవినీతి పరాకాష్ఠకుచేరడంతో ప్రభుత్వంపై మరింతగా వ్యతిరేకత పెల్లుబుకుతుందని ఇటీవల ఓకాంగ్రెస్ మాజీ మహిళాప్రతినిధి ఆవేదన వ్యక్తంచేశారు. అధికారుల అవినీతిపై తామే వీధుల్లోకి వచ్చి ఉద్యమిస్తామని హెచ్చరిక చేశారు. ఇకనైనా అధికారులు ప్రభుత్వభూముల పరిరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## కుందారం భూములపై పెద్దల కన్ను
-మావోయిస్టులు పంపిణీచేసిన భూముల కబ్జాకు యత్నం
-700 వందల ఎకరాలపై రియల్టర్ల దృష్టి



**రంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
రంగారెడ్డి జిల్లాలో అత్యంత ఖరీదైన భూములను కబ్జా చేయడానికి కొందరు బడాబాబులు వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు. కొన్నిదశాబ్దాలక్రితం మావోయిస్టులు నిరుపేద రైతులకు పంపిణీచేసినభూమిని తిరిగి వారినుంచి స్వాధీనం చేసుకోవడానికి పకడ్బందీ ప్రణాళికను సిద్ధంచేశారు. రాష్ట్రానికి చెందిన ఒక కేంద్రమంత్రి నుంచి రెవెన్యూ అధికారులకు ఒక సిఫారసు లేఖకూడా తీసుకుని అధికారులపై తీవ్రస్థాయిలో వత్తిడి తీసుకువస్తున్నారు. ఈవ్యవహారానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం ఇర్విన్ రెవెన్యూ శివారులో కుందారం భూములు ఉన్నాయి. కొన్నిదశాబ్దాలక్రితం ఈప్రాంతంలో మావోయిస్టుల కార్యకలాపాలు జోరుగాసాగేవి. వీరికి స్థానికంగా ఉన్న గ్రామ ప్రజలు అండగానిలిచేవారు. దీనితో ఈప్రాంతాలు చైతన్యానికి, తిరుగుబాటుకు మారుపేరుగా ఉండేవి. బడుగు రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న పలుసమస్యలపై మావోయిస్టులు దృష్టిసారించి వారికి న్యాయంచేసేవారు. కుందారంలో పెత్తందారుల చేతుల్లో ఉన్న సర్వే నెంబరు 1003 నుంచి 1053 వరకు ఉన్న సుమారు7వందల ఎకరాల భూములు ఉన్నాయి. కుందారంవంశానికి చెందిన రఘుమారెడ్డి, గీతారెడ్డి, సీతారెడ్డి, మోహన్‌రెడ్డిల పేర్లపై ఈభూములు ఉన్నట్లు రెవెన్యూరికార్డులో ఉంది. అయితే వాస్తవానికి ఈభూములను కుందారంవంశీయులు సాగు చేయకపోవడంతో మావోయిస్టుల ప్రాబల్యంతో ఈభూములను నిరుపేద రైతులకు అందించారు. అప్పటినుంచి అనేక మంది రైతులు ఈభూముల్లో సేద్యం చేసుకుంటున్నారు. కొందరు ప్రభుత్వం నుంచి ఓఆర్‌సిలు పొందారు. మరికొంతమందికి ఎలాంటి దస్తావేజులు లేవు. అయితే అనేకకుటుంబాలు ఈభూములపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. ఇర్విన్ రెవెన్యూ శివారులోని 700 పైచిలుకు ఎకరాల భూములు కుందారం వంశీయుల పేరిట ఉండగా వారిలో కొందరు దశాబ్దాల కాలంగా విదేశాల్లో స్థిరపడితే మరికొంతమంది హైద్రాబాద్‌లో స్థిరపడ్డట్లు తెలిసింది. ఈతరుణంలో గతంలో కల్వకుర్తికి చెందిన ఒక రాజకీయ నాయకుడు భూస్వాములతో చర్చించి 50 ఎకరాలకు ఓఆర్‌సి దరఖాస్తు చేయించి యజమానులకే తిరిగి భూమి దక్కాలని ప్రయత్నాలు ప్రారంభించారు. అయితే కొన్ని కారణాలవల్ల ఈప్రయత్నాలు ఫలించలేదు. అయితే ఈయన తోపాటు పలువురు పెద్దలు మాత్రం ఈభూములను కాజేయడానికి తమవంతు ప్రయత్నాలు చేస్తూనే ఉన్నారు. కాగా ప్రస్తుతం కుందారం భూములపై కన్నేసిన రియాల్టర్లకు మద్దతుగా ఓకేంద్రమంత్రి సిఫారసు లేఖ ఇచ్చినట్లు మండలంలో జోరుగా ప్రచారం జరుగుతోంది. సిఫారసు లేఖను తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించి తమ పనులు వెంటనే పూర్తి చేసి తమకు అనుకూలంగా నివేదికలు జిల్లా కలెక్టర్‌కు పంపాలని సదరు రియల్టర్లు తహసీల్దార్‌పై వత్తిడి తీసుకువస్తున్నట్లు తెలిసింది.

**ట్రిపుల్ ఆర్ రోడ్డు నిర్మాణంతో పెరిగిన డిమాండ్..**
రంగారెడ్డి జిల్లా కుందారం భూముల సమీపంలో ఆర్‌ఆర్‌ఆర్ రోడ్డు నిర్మిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. దీనితో ఈ భూములకు డిమాండ్ పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే రంగారెడ్డిజిల్లా నగరశివార్లలో విస్తరించి ఉండటంతో భూములు రేట్లు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇలాంటి తరుణంలో ట్రిపుల్ ఆర్ రోడ్డు వస్తుండటంతో ఈ భూములకు మరింత డిమాండ్ ఏర్పడింది. దీనితో రియల్టర్లు పెద్దసంఖ్యలో ఇక్కడకు చేరుకుని భూములను పొందడానికి పావులు కదుపుతున్నారు. ఇందులోభాగంగా గతంలో ప్రభుత్వంద్వారా ఓఆర్‌సిలు దక్కించుకున్న పేద రైతులకు ఎంతో కొంత నగదు అప్పజెప్పి అట్టి భూముల్లో పాగా వేసేందుకు జోరుగా ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. పేదరైతులకు బయానా ఇచ్చిన అనంతరం ఆయా భూములను దక్కించుకునేందుకు తహసీల్దార్ కార్యాలయంలో సిఫారసు లేఖలు మొదలు అనేక విధాలుగా ప్రయత్నాలు సాగిస్తున్నట్లు సమాచారం. దశాబ్దాల కాలంగా సాగుచేసుకుంటున్న కుందారం భూములపై రియల్టర్లు, రాజకీయనాయకుల కన్నుపడడంతో ఇర్విన్ సమీప గ్రామాలకుచెందిన పేదరైతుకుటుంబాలు తీవ్ర అయోమయంలో పడ్డాయి. పెద్దలుగా చెలామణి అవుతున్న వారి ఆగడాలతో సాగు చేసుకుంటున్న భూములు కోల్పోతే తమ కుటుంబాలకు ఆదరువు కరువవుతుందని పేదరైతుల కుటుంబాలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నాయి.

**సిఫారసు లేఖ వాస్తవమే: తహసీల్దార్..**
మాడ్గుల మండలం ఇర్విన్ రెవెన్యూ శివారులోని కుందారం భూములకు సంబంధించి పట్టాదారులకు అనుకూలంగా నివేదిక ఇవ్వాలని ఓ కేంద్రమంత్రి సిఫారస్ లేఖను కొందరు రియల్టర్లు తమ కార్యాలయానికి వచ్చిన విషయం వాస్తవమేనని మండల తహసీల్దార్ వినయ్‌సాగర్ తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్షేత్రపరిశీలన చేసి పూర్తి నివేదికను తయారుచేస్తామని ఆయన అన్నారు.

## ప్రజావాణిలో వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించాలి
-మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి



దరఖాస్తులు స్వీకరిస్తున్న జిల్లా అదనపుకలెక్టర్ విజయేందర్‌రెడ్డి పాల్గొన్న డిఆర్ఓ హరిప్రియ, అధికారుల దృశ్యం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
ప్రజావాణిలోవచ్చిన సమస్యలను వెంటనే సంబంధిత అధికారులు పరిశీలించి వాటిని పరిష్కరించాలని మేడ్చల్‌జిల్లా అదనపుకలెక్టర్ విజయేందర్‌రెడ్డి సూచించారు. సోమవారం మేడ్చల్‌జిల్లా కలెక్టరేట్‌లో ప్రజావాణికార్యక్రమం జరిగింది. జిల్లావ్యాప్తంగా వివిధప్రాంతాల నుంచి ప్రజలువిచ్చేసి ప్రజావాణిలో 82 దరఖాస్తులు, ఫిర్యాదులు, వినతులు అదనపుకలెక్టర్‌కు అందజేశారు. ఈ సందర్భంగ అదనపుకలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాకు సంబంధించి వివిధశాఖల అధికారులు స్వీకరించినదరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. అధికారులు స్పందించి వాటిని పరిశీలించి వెంటనే పరిష్కారానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. వాటిపై తీసుకున్న చర్యలను ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణికార్యక్రమంలో స్వీకరించిన ఫిర్యాదులకు, దరఖాస్తులను పెండింగ్‌లోపెట్టకుండా పరిష్కారానికి తగుచర్యలు తీసుకోవాలన్నారు. ప్రజాభవన్‌నుంచి ఆన్‌లైన్‌లోవచ్చిన వాటిని త్రిప్పిపంపే సమయంలో ఎందుకు తిప్పిపంపుతున్నారో వివరంగా సమాధానం ఇస్తూ తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ హరిప్రియ, జిల్లా లా ఆఫీసర్ చంద్రావతి, వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మామను చంపిన అల్లుడి అరెస్ట్

**పరిగి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
వికారాబాద్ జిల్లా పరిగి నియోజకవర్గం దోమ మండలం ఖమ్మం నాచారం గ్రామానికి చెందిన బోయిన మొగులయ్య ఆదివారం హత్యకు గురయ్యాడు. మొగులయ్య భార్య పద్మమ్మ ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టిన పోలీసులు సోమవారం నిందితుని అరెస్ట్‌చేసి రిమాండ్‌కి పంపారు. పోలీసులుతెలిపిన వివరాల ప్రకారం, నిందితుడు ఎడ్ల మల్లేశ్, మోత్కూర్‌గ్రామము, దోమ మండలానికి చెందినవాడని, మొగులయ్య కూతుర్ని వివాహంచేసుకున్న ఎడ్ల మల్లేశ్‌కు, ఇద్దరుసంతానం, మేస్త్రీపనిచేస్తూ జీవనం సాగిస్తూ ఉంటాడని, దాంపత్య జీవితంలో చిన్నచిన్న గొడవలుపడి, నిందితుడిభార్య తనపుట్టింటికి వెళ్ళింది. కొన్ని రోజులతర్వాత కొట్లాడగా వారిని తనమామగారు (చనిపోయిన వ్యక్తి) తీసుకొచ్చి తనదగ్గరే ఉంచుకున్నాడు. తనభార్యను మళ్ళీతనతోపంపించాలని తనమామతో తరచూ గొడవపడేవారు. దీనితో నేరస్థుడు తన మామపై పగపెంచుకొని ఎలాగైనా ఇతని అడ్డు తొలగిస్తేనే తనభార్యను తన దగ్గరకి తెచ్చుకోవచ్చనే ఉద్దేశ్యంతో తనమామని చంపాలని నిర్ణయించుకొని, 5వతేది రాత్రి సమయం 9గంటలకు మొగులయ్యని తన వ్యవసాయపొలం దగ్గర ఆవులషెడ్‌లో పడుకున్న తనమామని తలపై, మొఖంపై నరికి చంపాడని, గొడ్డలిని తీసుకొని పారిపోతూ మార్గమధ్యంలో పొదల్లో గొడ్డలిని విసిరేశాడని దర్యాప్తులో తెలిసిందని పోలీసులు తెలిపారు. దర్యాప్తులోభాగంగా ఆగొడ్డలిని స్వాధీనపర్చుకొని, నేరస్థుడిని అరెస్టుచేసి రిమాండ్‌కు పంపడం జరిగిందని సిఐ శ్రీనివాస్ తెలిపారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**శంషాబాద్,ఏప్రిల్7, ప్రభాతవార్త :** శంషాబాద్ మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు 10 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సోమవారం అందజేశారు. ఆయన నివాస గృహంలో జరిగిన కార్యక్రమంలో బహదూర్ గుడా. ఘూన్సీ మియా గుడ. కవ్వగూడ. రషీద్ గూడ. పెద్ద షాపూర్ తండా. సుల్తాన్ పల్లి. మదనపల్లి తండా రామాంజపురం. పెద్దతుప్ర. నర్కుడ. పాలమాకుల గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు మొత్తం 10 లక్షల రూపాయల చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ప్రకాష్‌గౌడ్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడానికి సిఎం రిలీఫ్ ఫండ్ పథకం శ్రీరామరక్షల నిలుస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరు దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సీనియర్ నాయకుడు కోడిగంటి చంద్రారెడ్డి. నీరటిరాజు ముదిరాజ్. దండు ఇస్తారి. జుట్టేసిద్దులు. దేవరకొండ రమేష్‌యాదవ్. దవణాకర్ గౌడ్. అనగోనే శ్రీకాంత్ గౌడ్. పూసలపాటి యాదయ్య గౌడ్ పాల్గొన్నారు.

## రామాంజపురంలో చలివేంద్రం ఏర్పాటు



రామాంజపురం గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు చేసిన దృశ్యం

**శంషాబాద్ ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** శంషాబాద్ మండలం రామాంజపురం గ్రామంలోసోమవారం పుంజాల మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇలాంటి సేవా కార్యక్రమాలుచేయాలనియువతకుసూచించారు. వేసవి కాలంల ్ప్రజల దాహార్తిని తీర్చడానికిచలివేంద్రాలు ఎంతో ఉపయోగపడ తాయని మహేష్ కుమార్ సూచించారు. పంచాయతీకార్యదర్శి నాగరాజు. గ్రామ ప్రముఖులు కొమిరెడ్డిరఘునందన్ రెడ్డి. మాధవరెడ్డి. ఎల్లయ్య. జంగయ్య. ప్రకాష్. ఈశ్వర్ చారి. సత్తయ్య. మురళి. అంజయ్య. విజయ్ కుమార్. బాబురావు. మల్లేష్. శ్రీను. కృష్ణ. రాజు. రమేష్ పాల్గొన్నారు.

## వివేకానంద విగ్రహం కోసం ఆర్థిక సాయం



20వేల రూపాయల చెక్కు అందజేస్తున్న ఉప్పల వెంకటేష్

**తలకొండపల్లి ఏప్రిల్ 7, ప్రభాతవార్త;** తలకొండపల్లి మండల పరిధిలోని సంగాయపల్లి గ్రామంలో నూతనంగా స్వామి వివేకానంద విగ్రహం ఏర్పాటుకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ నుంచి సోమవారం నాడు 20వేల రూపాయలు తలకొండపల్లి మాజీ జెడ్పిటిసి ఉప్పల వెంకటేష్ అందజేశారు. తలకొండపల్లి మాజీ ఎంపీపీ తిరుమణి నిర్మల శ్రీశైలంగౌడ్ సహకారంతో సోమవారం నాడు హైదరాబాదులోని ఉప్పల వెంకటేష్‌ను కలిసి విగ్రహం ఏర్పాటుపై వివరించడం జరిగింది. సొంతంగా ఆర్థికసాయం అందజేసి అభినందించారు. శ్రీశైలం, నరేష్ గౌడ్, సురేష్ గౌడ్, తదితరులు ఉన్నారు.

## మా కాలనీని పట్టించుకోండి

### కాంగ్రెస్ యువ నాయకుడు మధు

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (ఏప్రిల్7) :** పట్టణంలోని గాంధీనగర్ కాలనీలో ఇనుప స్తంభం ఒరిగిందని, పరిస్థితి డేంజర్‌లో ఉందని కాలనీకి చెందిన కాంగ్రెస్ యువ నాయకుడు మధు అన్నారు. వర్షాలు పడే సమయంలో ప్రమాదం సంభవించే అవకాశం ఉందని, కాలేజీ విద్యార్థులు, ప్రజలు ఎక్కువగాఈకాలనీలోగుండావెళ్తుంటారని, అలాంటిదారిలోప్రమాద ్రితంగా ఉన్న ఇనుప స్తంభాన్ని తొలగించాలని కాంగ్రెస్ నాయకుడు మధు విద్యుత్ శాఖ ఏడీ, ఏఈలను కోరారు. ఎం.డి. మొయినుద్దీన్, వెంకటేశం గుప్తా, ధర్మప్రకాష్, ఆదిల్‌పాష, అశోక్, సాయి, ఆసిఫ్, హేమంత్, సంతోష్, ప్రదీప్, రాఘవేందర్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

## పేదల పెన్నిధి సిఎం సహాయ నిధి




**ధారూరు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** సీఎం సహాయ నిధి పేదలకు పెన్నిదని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు మాన్సింగ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోనీ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద వివిధ గ్రామాలకు చెందిన 12 మంది బాధితులకు కా న్,రూ. 9,01,500 లక్షల చెక్కుల ు స్పీకర్ గడ్డం ప్రసాద్ ఆదేశాల మేరకు పంపిణీ చేశామని తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైద్యం పరంగా ఆపదలో ఉన్నవారికి సకాలంలో చికిత్స కోసం అందిస్తున్న నిధులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కోలుకోలేని స్థితిలో ఉన్న కుటుంబాన్ని కొంతైనా ఆదుకోవాలని గొప్ప సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహాయనిధి ద్వారా ఆర్థిక సాయం అందించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ విజయభాస్కర్ రెడ్డి, వైస్ చైర్మన్ అశోక్, మండల ఉపాధ్యక్షుడు ముజఫర్, నాయకులు బాబా ఖాన్, లాల్ మొహమ్మద్, అమర్నాథ్ పటేల్, జాకీర్, వెంకట్, అంజయ్య, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## టిఎన్‌జిఓ డైరీ,క్యాలెండర్ ఆవిష్కరణ



**ధారూరు,ఏప్రిల్7,ప్రభాతవార్త:** టీఎన్జీవో (తెలంగాణ పంచాయతీ సెక్రెటరీ ఫోరం) డైరీక్యాలెండర్‌లుమండల కేంద్రంలోనిఎంపీడీవో కార్యా లయంలో ఎంపీడీవో నర్సింలు, ఎంపీఓ సఫివుల్లాఖాన్‌చేతులమీదుగా సోమ వారం ఆవిష్కరించారు .టిపిఎస్సి ఎఫ్ జిల్లా అధ్యక్షులు మధుకర్ రెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ రాం విహార్, ధారూర్ మండల పంచాయతీ కార్యదర్శి ఆరిఫ్‌ఖాన్, దేవేందర్ రెడ్డి, శివ సాయిరాఘవ, వెంకటయ్య, కిషన్, గణేష్, కృష్ణ, సుమలత, మమ,త తిరుపతి, యోగిత, సునీత, స్పందన, ప్రసన్న, పాల్గొన్నారు.

# సర్కారు బడుల బలోపేతానికి కృషి చేయాలి



ఎలుగొండగూడ ప్రభుత్వ పాఠశాలకు ఆకృతి సంస్థ అందజేస్తున్న ల్యాప్ ట్యాప్

**షాబాద్,ఏప్రిల్7,ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి గ్రామస్తులు కృషి చేయాలని షాబాద్ మండలం విద్యాధికారి లక్ష్మణ్ నాయక్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా షాబాద్ మండల పరిధిలోని ఎల్గొండగూడ గ్రామంలో బడిబాట వాల్‌పోస్టర్, కరపత్రాన్ని సోమవారం గ్రామ పెద్దలతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ..ప్రభుత్వంఎంతోఖర్చుచేసి, గ్రామంలో మంచి ప్రమాణా లతో విద్యను అందించేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకొని, తమ పిల్లలను గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చూడాలన్నారు. ప్రైవేట్ పాఠశాలలకుదీటుగాప్రభుత్వపాఠశాలలోఅన్నివసతులు కల్పిస్తూ, మంచి నైపుణ్యం, శిక్షణగల ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమిస్తు న్నట్లు తెలిపారు. ప్రైవేటు పాఠశాలల వైపు ఆకర్షిస్తూ తమ పిల్లలను ఆ బడుల్లో చేర్పించి, ప్రభుత్వపాఠశాలలనుబలహీనపరచడంగ్రామానికి మంచిది కాదన్నారు. దీనిపై స్పందించిన గ్రామస్తులు గ్రామంలోని బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తామని, గ్రామంలోకి వచ్చే ప్రైవేటు స్కూల్ బస్సులను బహిష్కరించి, వచ్చేజూన్‌లో కనీసం40నుండి50 మంది విద్యార్థులు పాఠశాలలో చదివేవిధంగా చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో ఆయన సంతోషంవ్యక్తంచేశారు. గ్రామప్రధానోపాధ్యాయులుమల్లేష్ గౌడ్‌మాట్లాడుతూ. పిల్లలకు మంచిచదువు అందించివిద్యలో రాణించేలా చర్యలు తీసుకుంటానని అన్నారు. ఆకృతిస్వచ్ఛంద సంస్థ పాఠశాలకు ల్యాప్ ట్యాప్ బహుకరించడంపై వారిని అభినందించారు. రవీందర్‌రెడ్డి, మాజీసర్పంచ్ ఆంజనేయులుగౌడ్, ఆదర్శ పాఠశాలకమిటీచైర్మన్‌వర్షిత, ఎస్ఎంసికమిటీమాజీ చైర్మన్‌యాదయ్య, గ్రామస్తులుబలరాం, సతీష్, శ్రీనివాస్, పాల్గొన్నారు.

## వ్యాపార రంగంలో యువత రాణించాలి



షాపును ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (ఏప్రిల్ 7) :** యువత వ్యాపార రంగంలో ఆర్థికంగా ఉన్నత స్థాయికి ఎదగాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ అన్నారు. సోమవారం బైపాస్ యమ్మీ హోటల్ సమీపంలో సాయిరాం నూతనంగా ఏర్పాటు చేసిన సాయిదత్తా కారు మెకానిక్, వాషింగ్ సెంటర్‌ను, మహబూబ్‌నగర్ రోడ్డు వైపు బీఆర్ఎస్ నాయకుడు వెంకట్ నాయక్ నూతనంగా ఏర్పాటు చేసిన వెంకటేశ్వర వాటర్ వాషింగ్ సెంటర్‌ను మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారంలో నిర్వాహకులు ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్, మాజీ వైస్ చైర్మన్ నటరాజన్, మాజీ కౌన్సిలర్లు జి.టి.శ్రీనివాస్, ఈశ్వర్ రాజు, మహిళా నాయకురాలు గడ్డం రాజ్యలక్ష్మీ, నాయకులు రఘునాథ్ యాదవ్, చీపిరి రవి యాదవ్, భువనేశ్వర్ రెడ్డి, జూపల్లి శంకర్, అందె జంగరాజ్, గాదె సుధాకర్, రాఘవేందర్, అందె మహేశ్వర్, గుండు అశోక్, రఘు, పాల్గొన్నారు.

## విద్యుత్ పరఫరా నిలిపివేత

**మేడ్చల్,ఏప్రిల్ 7. ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోని మైసమ్మగూడ ఫీడర్ విభజన చేపడుతున్నందున నేడు ఉదయం 11 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ విజయ్‌కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మైసమ్మగూడ ఫిడర్‌లో దేవాలయాల వద్ద విద్యుత్ స్థంబాల ఏర్పాటు చేస్తామని, అందుకు కరంట్ అంతరాయం ఉందదని తెలిపారు. ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

## గుండ్లపోచంపల్లిలో బిజెపి జెండావిష్కరణ



**మేడ్చల్, ఏప్రిల్ 7. ప్రభాతవార్త :** అంత్యోదయమే లక్ష్యంగా బిజెపి పార్టీ ఆవిర్భవించిందని బిజెపి మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ మోహన్‌రెడ్డి అన్నారు. బిజెపి ఆవిర్భావ దినోత్సవాల్లో భాగంగా గుండ్లపోచంపల్లి మున్సిపల్ 37వ బూత్‌లో బిజెపి నాయకులు జెండావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దేశంలోని చిట్టచివరి వ్యక్తి వరకు అభివృద్ధి ఫలాలు అందించాలనే ఉద్దేశ్యంతోనె బిజెపి పార్టీ ఆవిర్భవించిందని అన్నారు. ఎంతో మంది నాయకులు, కార్యకర్తల త్యాగాల ఫలితంగానే పార్టీ ఉన్నతమైన స్థానంలో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ బిజెపి అధ్యక్షుడు శ్రీధర్ ముదిరాజ్, నాయకలు రవీందర్ గౌడ్, రామారావు, ప్రదీప్‌రెడ్డి, పభాకర్‌రెడ్డి, విజయ్‌కుమార్, నవీన్, శ్రీకాంత్, అభిలాష్‌రెడ్డి, అనుదీప్‌రెడ్డి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## యాదాద్రి లాడ్జిని ప్రారంభించిన అందె బాబయ్య

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (ఏప్రిల్7) :** షాద్‌నగర్ బైపాస్ ప్రాంతంలో నూతనంగా ఏర్పాటు చేసిన యాదాద్రి లాడ్జిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందె బాబయ్య సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులు తమ వ్యాపారంతో పాటు సామాజిక సేవలో పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థులు శ్రద్ధగా పరీక్షలు రాయాలి...

**దుద్యాల్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** మండల పరిధిలోని అల్లిఖాన్ పల్లి ప్రభుత్వ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న 19 మంది విద్యార్థులకు మండల విద్యాధికారి విజయరామారావు సోమవారం పరీక్ష సామాగ్రి ప్యాడ్లు, పె న్నులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎస్ఏ 2 పరీక్షలు శ్రద్ధగా రాయాలని ఉన్నత విద్యకు అర్హత సాధించాలని సూచించారు. ఉపాధ్యాయులు చెప్పిన విషయాల ు శ్రద్ధతో విని పాటించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్, పాఠశాల హెచ్ఎం అశోక్, దుద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు మల్లప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ దయాకర్‌కు మాలమహానాడు సత్కారం



**ఘట్‌కేసర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:** శాసనమండలి సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన డాక్టర్ అద్దంకి దయాకర్‌ను మాలమహానాడు నాయకులు సన్మానించారు. శాసనసభ్యుల కోటాలో ఎమ్మెల్సీగా ఎన్నికై మండలలో పదవీప్రమాణ స్వీకారం చేయడంతో దయాకర్‌ను జాతీయ మాలమహానాడు రాష్ట్ర కమిటీ బృందం సోమవారం కలిసింది. ఈసందర్భంగా ఆయనను శాలువాతో సన్మానించి బహుమతిని అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. జాతీయ మాలమహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు పిల్ల సుధాకర్, జాతీయ అధికార ప్రతినిధి యశోధ భాస్కర్, వర్కింగ్ ప్రెసిడెంట్ చిప్పల నర్సింగ్‌రావు, రాష్ట్ర ప్రధానకార్యదర్శి మేడి అంజనేయులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు అసాద్య పురుషోత్తం, మేడ్చల్‌జిల్లా కన్వీనర్‌గుజుక పరుశురాం, జిల్లాఉపాధ్యక్షులు అంజనేయులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత



**తలకొండపల్లి ఏప్రిల్ 7, ప్రభాతవార్త;** తలకొండపల్లి మండల పరిధిలోని గట్టు ఇప్పలపల్లి గ్రామానికి చెందిన గోవిందు మంజులకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన 14,500 రూపాయల చెక్కును సోమవారం నాడు లబ్ధిదారులకు అందజేశారు. ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి సహకారంతో మంజూరైన సీఎం రిలీఫ్ అండ్ చెక్కును బిఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ జ్వరం జయమ్మ వెంకటయ్య ల ఆధ్వర్యంలో లబ్ధిదారుడి గోవిందు మంజులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతోమంది నిరుపేద ప్రజలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఆపద్భాంధవుడులాగా ఆదుకోవడం అభినందనీయమని వారు కొనియాడారు. బి ఆర్ఎస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ జూలం జయమ్మ వెంకటయ్య, బి ఆర్ఎస్ నాయకులు మండల కృష్ణయ్య, గ్రామ కమిటీ అధ్యక్షులు ఏ దుల రాజు, రవీందర్ ,అశోక్, లింగం యాదవ్, నరేష్, వెంకటయ్య ఉన్నారు.

## ఆంజనేయ స్వామికి మకర తోరణం ఏర్పాటు



**దుద్యాల్,ఏప్రిల్7,ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామికి మకర తోరణం సోమవారం ఏర్పాటు చేశారు. దుద్యాల గ్రామానికి చెందిన అమంతగిరి నారాయణ కుటుంబ సభ్యులు రూ. 32వేల ఖర్చుతో స్వామివారికి ఇత్తడి మకర తోరణం అందజేశారు. గ్రామాల్లో ఆలయాలు అభివృద్ధి చెందాలంటే అందరి సహకారం అవసరమని చెప్పుకొచ్చారు.

# ప్రపంచ ఆరోగ్య దినోత్సవ ర్యాలీ




ప్రపంచఆరోగ్యదినోత్సవం ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (ఏప్రిల్7) :** మనిషికి ఆరోగ్యానికి మించిన ఆస్తి మరొకటి లేదని, ప్రతి ఒక్కరు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయలక్ష్మీ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రి నుండి ఫరూఖ్‌నగర్‌లోని గాంధీ చౌక్ వరకు ర్యాలీని నిర్వహించగా, డాక్టర్ విజయలక్ష్మీ ఈర్యాలీని ప్రారంభించారు. ఈసందర్భంగాడాక్టర్ విజయలక్ష్మీ మాట్లాడుతూ 1948 ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏర్పాటయ్యి ందని, అందుకే ప్రతియేటా ఏప్రిల్ 7న ప్రపంచ ఆరోగ్య దినోత్సవంగా జరుపుకుంటామని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా మొత్తం ఫెర్టిలిటీ రేటు ఆందోళనకర స్థాయిలో తగ్గిపోతున్న ప్రస్తుత తరుణంలో, మాతా శిశు సంరక్షణ అత్యంత ముఖ్యమైన అంశమని, ఈ సంవత్సరం ఆరోగ్యకర ఆరంభాలు ఆశాజనక భవితవ్యాలు అనే నినాదంతో ముందుకు వచ్చిందని తెలిపారు. ప్రజా ఆరోగ్యానికి మూలస్తంభవ తల్లి బిడ్డ ఆరోగ్యమని, తల్లి బిడ్డ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని తెలిపారు. హెల్త్ ఎడ్యుకేటర్ జె.శ్రీనివాసులు మాట్లాడుతూ మంచి ఆహార నియమాలు పాటిస్తూ, పోషకాహారాన్ని భుజిస్తూ, ప్రతి ఒక్కరు వ్యాయామం చేయాలని సూచించారు. ఎమ్ఎల్‌హెచ్‌పి వైద్యాధికారులు జగదీష్, సంధ్య, ముస్తకిన్ అహ్మద్, హెల్త్‌సూపర్‌వైజర్లు రమ, అమృత, రవికుమార్, లింగం, చించోడ్, పిపి యూనిట్ ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.

## పేదల ఆకలి తీర్చేందుకే సన్న బియ్యం



సన్న బియ్యం పంపిణీ చేస్తున్న నాయకులు

**చౌడాపూర్, ఏప్రిల్7ప్రభాతవార్త :** పేదలఆకలితీర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీ చేస్తుందని చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుఎల్పటిఅశోక్‌కుమార్‌అన్నారు. పరిగి ఎంఎల్ఏ డాక్టర్ రామ్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, మండలంలోని మక్తా వెంకటాపూర్ గ్రామంలో సోమవారంసన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్పెషల్ ఆఫీసర్ తహసిల్దార్ ప్రభువులు. ఉమ్మడి కులకచ్చర్ల మార్కెట్ కమిటీవైస్ చైర్మన్ రామ్మోహన్‌శర్మ, గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేష్ రెడ్డి, చౌడాపూర్ పంచాయతీ కార్యదర్శి రాజిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి, జెవెంకట్, రామ రావు, లాలూ. సూర్య నాయక్ ,సంతోష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## శివమారుతి ఆలయంలో అన్నదానం

**షాద్‌నగర్,ప్రభాతవార్త,(ఏప్రిల్7) :** అన్నదానం మహాదానమని శివ మారుతి గీతా అయ్యప్ప మందిర అభివృద్ధి కమిటీ కార్యదర్శి రేటికల్ నందీశ్వర్ అన్నారు. షాద్‌నగర్ కల్పవృక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అన్ని దానాల్లో అన్నదానం గొప్పదని, అన్నం పరబ్రహ్మ స్వరూపమని అన్నారు. ప్రతి సోమవారంఅన్నదానం చేసేందుకు ముందుకు వచ్చిన ఫౌండేషన్ నిర్వాహకులు నాగిళ్ల కుమారస్వామికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ అన్నదాన కార్యక్రమాన్ని అందరుసద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్, దేవిదాస్, సుమంత్, మల్లేష్, రాజు, దేవాలయం మేనేజర్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## వక్ఫ్‌బోర్డు బాధితులకు అండగా వైఎస్ఆర్



సుదర్శన్‌రెడ్డికి లేఖను అందజేస్తున్న వక్ఫ్‌బోర్డ్ బాధితుల జేఏసీ నాయకులు

**ఘట్‌కేసర్,ఏప్రిల్7,ప్రభాతవార్త:** వక్ఫ్‌బోర్డు బాధితులకు ఎల్లప్పుడు అండగా ఉంటామని బిజెపిరాష్ట్ర కార్యవర్గసభ్యులు-ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి అన్నారు. బోడుప్పల్ వక్ఫ్‌బోర్డు బాధితుల జేఏసీ కో-కన్వీనర్ గుమ్మడి జైపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎంపిపిని కలిశారు. ఘట్‌కేసర్ మున్సిపల్ అవుషాపూర్‌లోని సుదర్శన్‌రెడ్డి నివాసంలోవారు ఆయనను కలిసి మాట్లాడారు. తమ జీవితాలకు శాపంగా మారిన వక్ఫ్‌బోర్డ్ రద్దుకోసం తాము చేస్తున్న పోరాటంలో తమకుఅండగా నిలిచిన సుదర ్శన్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పార్లమెంట్ఉభయసభల్లో వక్ఫ్‌బోర్డుకు అపరిమిత అధికారాలను సవరిస్తూ చారిత్రాత్మక బిల్లును ఆమోదించారని వారు హర్షం వ్యక్తం చేశారు.

## రజకసంఘం కార్యవర్గం ఎన్నిక



ఎదులాబాద్ రజకసంఘం నూతన కార్యవర్గ సభ్యులు

**ఘట్‌కేసర్,ఏప్రిల్7, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ మున్సిపల్ ఎదులాబాద్ రజక సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా సింగారంసుక్కయ్య, ఉపాధ్యక్షులుగాబాలమైసిని నాగేష్, ప్రధానకార్యదర్శిగా నడిమింటిసాయిలు, సంయుక్తకార్యదర్శిగామాదారంబాలరాజు, కోశాధికారిగా ఎ ర్రోళ్ల శ్రీనివాస్, సంయుక్త కోశాధికారిగా బాచారంబంగారి, కార్యవర్గ సభ్యులుగా ఎర్రోళ్ల సత్యనారాయణ, నడిమింటి వెంకటేష్, బాలమైసిని రాజు, పిలాయిపల్లి మల్లేష్, చౌదరిపల్లి పాండు, గూడూరు భానుచందర్, సలహాదారులుగా బింగి సత్యనారాయణ, నడిమింటి శ్రీరాములు, సింగారం మైయ్య, మాదారం లింగంలను ఎన్నుకున్నారు.

## సామాజిక బాధ్యతగా పాఠశాల అభివృద్ధిలో బిఆర్ఎస్ నేత



**కొత్తూర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** విద్యార్థుల మెరుగైన భవిష్యత్తుకు పాఠశాల స్థాయిలో సహాయం కొత్తూర్ మండలంలోని కొడిచర్లలో ఉన్న ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రానికి అవసరమైన ఫర్నిచర్‌ను బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఎమ్మె సత్యనారాయణ సోమవారం అందజేశారు. పాఠశాల, అంగన్‌వాడీలో ఫర్నిచర్ కొరత ఉందన్న విషయంస్థానిక నాయికులు ఆయన దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించిన ఆయన తన సొంత ఖర్చులతో అవసరమైన సామగ్రిని అందజేసి అభినందనలందుకున్నారు. ఈసందర్భంగాఆయన మాట్లాడుతూ..విద్యార్థులబంగారుభవిష్యత్తుకు పునాది పాఠశాల స్థాయిలోనే ఉంటుందన్నారు. ప్రభుత్వ విద్యావ్యవస్థను బలోపేతం చేయడంద్వారాసమాజ అభివృద్ధికి దోహదం చేయవచ్చన్నారు. ప్రభుత్వ పాఠశాలలఅభివృద్ధికితనసంపూర్ణ సహకారం ఎల్లప్పుడు ఉంటుంద న్నారు. పాఠశాలఅభివృద్ధికి సహకరించిన ఎమ్మె సత్యనారాయణను గ్రామస్తులు, పాఠశాల ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మా నించారు. కళ్లెంనరసింహారెడ్డి, జంగయ్యయాదవ్, మాణిక్‌రెడ్డి, మల్లేష్‌యాదవ్, జంగయ్య, శేఖర్, అంగన్‌వాడీ టీచర్లుఉన్నారు.

## మోడల్ స్కూల్‌లో ఘనంగా వార్షికోత్సవం

**నర్సాపూర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త :** మండల పరిధిలోని జక్కపల్లిలోగల తెలంగాణ మోడల్ స్కూల్‌లో సోమవారం ఉపాధ్యాయులు విద్యార్థులు కలిసిపాఠశాల వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటపాటలతోపాటు చదువులో ఉన్నతస్థాయికి ఏ విధంగా చేరు కావాలో ప్రిన్సిపాల్ పర్వీన తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత చదువులు చదివి జీవితం ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. నిర్వహించగా విద్యార్థుల ఆటలు, పాటలు, డాన్స్‌లు, పలువురిని ఎంతగానో అకట్టుకున్నాయి. అంతేగాక ఈ నెల 27న ఎంట్రన్స్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు మాడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పర్వీన తెలిపారు. ఈ కార్యక్రమంలో మోడల్ స్కూల్ పాఠశాలపిడి అశోక్, ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

**షాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
స్వాధ్యాయి పరివార్ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. మండలంలోని ముద్దెంగూడ, బొబ్బిలిగామ, మంచన్‌పల్లి తదితర గ్రామాల్లో శ్రీరాముని చిత్రపటంతో, ఆటపాటలతో యువతీయువకులు, మహిళలు శోభయాత్ర నిర్వహించి పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని అంగరంగవైభవంగాజరుపుకున్నారు. సీతాదేవి స్వయంవరం నాటికను చిన్నారులు కళ్లకుకట్టినట్లు వేసి చూపించారు.

## ఘనంగా మల్లన్నస్వామి కళ్యాణోత్సవం



మల్లన్న కళ్యాణంలో పాల్గొన్న వజ్రేశ్‌యాదవ్, పావని

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ మున్సిపల్ అవుషాపూర్‌లో సోమవారం శ్రీమల్లన్నస్వామి కళ్యాణోత్సవం ఘనంగా జరిగింది. కాంగ్రెస్‌పార్టీ నాయకులు ముద్దం మల్లేశ్‌యాదవ్ నివాసంలో నిర్వహించిన మల్లన్న పండుగలో టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్, ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్యయాదవ్‌లు పాల్గొన్నారు. ఒగ్గుకళాకారుల మంత్రోచ్చరణలతో కళాకారులబృందంచే ఘనంగా మల్లన్నస్వామి కళ్యాణం జరిపించారు. మహిళాభక్తులు స్వామికి వడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈసందర్భంగా నిర్వహకులు మల్లేశ్‌యాదవ్ నాయకులను శాలువాలతో సన్మానించారు. ఈకార్య క్రమంలో పోచారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ బాలగౌని వెంకటేశ్‌గౌడ్, డిసిసి కార్యదర్శి ఉల్లి అంజనేయులు, మున్సిపల్ ఉపాధ్యక్షులు కొరుబోతు నాగరాజు, ఎస్సీ సెల్ అధ్యక్షులు మోత్కుపల్లి శ్రీనివాస్, నాయకులు కవాడి వామన్‌రెడ్డి, బాలకృష్ణ, గోదా గణేశ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## కష్టాల్లో తండ్రికి సహాయం చేస్తున్న రైతుబిడ్డలు



**యాచారం, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామానికి చెందిన ఓ రైతు తన పంటపొలాల్లో కూరగాయల సాగుచేస్తున్న తరుణంలో కలుపు తీసేయ టానికి పనిముట్లతో కాకపోవడంతో తన కొడుకుబిడ్డతో గుంటుక నాగలి పని చేస్తున్నారు. రైతు కుటుంబంలో పుట్టడం వల్ల తమ పిల్లలు క్రమశిక్షణ పనివిలువ జీవనవిధానం సర్వసాధారణంగా ఉంటుందని రైతు తెలిపారు. రైతుబిడ్డకు వృత్తినైపుణ్య శిక్షణ పొందడంలో ఉద్యోగరీత్యా ఒక్కరివద్ద ఉన్న వాళ్ళ దగ్గర పనిచేయడం కూడా సులువుగా ఉంటుందని రైతులు పెద్దలు తమ అభిప్రాయాలనువ్యక్తంచేస్తుంటారు. రైతులుపంటలుపండించి లాభాలు లేకున్నా పెట్టినపెట్టుబడికి గిట్టుబాటు ఉంటే సరిపోతుందని సంతృప్తి చెందుతుంటారు. ఎంతకష్టం చేసినా లాభంరాకుండా నష్టమే జరుగుతుం దని తెలిసికూడా పదేపదే చేసేదే వ్యవసాయమని విశ్లేషకులు రైతు శ్రేయో భిలాషులు అంటుంటారు. ప్రభుత్వాలు ఆధునికయంత్రాలను సబ్సిడీ ద్వారా అందజేయాలని రైతేరాజు రైతురాజ్యం అనిపొగడే ప్రజాప్రతినిధులు అధికారులు వారికి అధికంగా సబ్సిడీలలో సౌకర్యాలుకల్పించాలని కోరుతు న్నారు. ప్రభుత్వాలు మారినా ఆధునికయుగంలో ఎన్నో మార్పులు వచ్చిన రైతులకు లబ్ది చేకూరకపోగా నష్టాలే అధికంగా ఉంటున్నాయని వారిని ఆదుకునే పరిస్థితులు లేకపోవడం బాధాకరం అంటున్నారు. రైతులకు గిట్టుబాటుధర కల్పించడం దళారీవ్యవస్థను ఆపి, నాణ్యమైన విత్తనాలు తక్కువధరకు సబ్సిడీలలో ఎరువులు అందజేయాలని కోరుతున్నారు.

## వెంచర్లలో వక్ఫ్‌బోర్డు ఆంక్షలు ఎత్తివేయాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిపాల్‌రెడ్డి

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
లేఔట్లలో ప్లాట్లపై వక్ఫ్‌బోర్డు ఆంక్షలు తొలగించేవరకు బాధితులకు బిజెపి అండగా ఉంటుందని మున్సిపల్ బిజెపి అధ్యక్షులు కొమ్మిడి మహిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు సోమవారం వక్ఫ్‌బోర్డు సవరణ బిల్లు ఆమోదం పొందిన సందర్భంగా బిజెపి ఆధ్వర్యంలో ఘట్‌కేసర్ మున్సిపల్ కమీషనర్ బి.చంద్రశేఖర్, ఇంచార్జ్ సబ్‌రిజిస్ట్రార్ అనిల్‌కుమార్‌లను కలిసి వెంచర్లపై వక్ఫ్‌బోర్డు ఆంక్షలు ఎత్తివేయాలని వినతిపత్రాలను అందజేశారు. ఘట్ కేసర్ మున్సిపల్‌పరిధిలో హెచ్ఎండిఏ వెంచర్లు పటేల్‌నగర్, ప్రైమ్‌లాండ్, ఏవి కన్‌స్ట్రక్షన్‌లలో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారు స్థలాలు కొనుగోలుచేశారని వక్ఫ్‌బోర్డుపేరుతో విధించిన ఆంక్షలతో ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని ఆంక్షలు ఎత్తివేయాలనికోరారు. ఈకార్యక్ర మంలో బిజెపి రాష్ట్ర నాయకులు కాలేరు రామోజీ, మంగు శ్రీనివాస్‌రావు, బిజెవైఎం అధ్యక్షులు కొమ్మిడి విక్రాంత్‌రెడ్డి, ఉపాధ్యక్షులు అనిల్‌గౌడ్, మహిళా మోర్చ నాయకురాళ్లు మంగు రాధిక, మమతశర్మ, బూత్ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణికి 56 ఫిర్యాదులు

**-ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి**
**-జిల్లా రెవెన్యూ అధికారి సంగీత**



ఫిర్యాదును స్వీకరిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి సంగీత

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి హైదరాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
ప్రజావాణి కార్యక్రమంలో వచ్చేసమస్యలకు అధిక ప్రాధాన్యతనిస్తూ వచ్చిన ఫిర్యాదులను సత్వరమనే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి సంగీత సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లాకార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా తమ సమస్యలు తెలపడానికి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను జిల్లా రెవెన్యూ అధికారి సంగీత స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో శాఖల వారీగా స్వీకరించిన ఫిర్యాదులపై సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ అధికారులు, మండల తహసీల్దార్లు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# అంబా భవానీ సాక్షిగా ఆ 'పైసా' నేను ముట్టను

**వాళ్లు పైసా ముట్టలేదని భవానీ మాతపై ఒట్టేస్తారా..?**
**షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**షాద్‌నగర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
అంబా భవానీ సాక్షిగా చెబుతున్నాను.. ఎలికట్ట పరిధిలో ఉన్న పరిశ్రమల వద్ద నయా పైసా నేను ముట్టలేదు.. ముట్టను కూడా.. గత పాలకులు గుండెలపై చేయి వేసుకొని చెప్పమనండి అంబ భవానీసాక్షిగా డబ్బులుముట్టారో లేదో? చెప్పాలని ఎలికట్ట గ్రామస్థుల ముందు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఫరూఖ్‌నగర్ మండలం మహల్ ఎలికట్ట గ్రామంలో నూతన రేషన్ షాపును స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ చేతులమీదుగా ప్రారం భించారు. ఈసందర్భంగా గ్రామంలో రేషన్ లబ్ది దారులకు సన్నబియ్యాన్ని స్వయంగా పంపిణీ చేశారు. అనంతరం గ్రామస్థులను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను గ్రామాల్లో మీకన్నా ఎక్కువ కష్టాలు అనుభవించి ఈస్థాయికి వచ్చానని చెప్పుకొచ్చారు. పేదలు పడుతున్న కష్టాలు తనకు తెలుసని, ఎవరైనా తన దృష్టికి సమస్యలు తీసుకువస్తే వాటిలో కొన్ని అయినా తీర్చే సత్తా ఉందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. మహల్‌ఎలికట్టలో రేషన్‌షాపుకోసం మహిళలు గతంలో తనదృష్టికి తీసుకువచ్చారని, అయితే వారికోసం ఇప్పుడు నూతన రేషన్‌షాపును ప్రారం భించినట్లు తెలిపారు. అదేవిధంగా ఈప్రాంత అభి వృద్ధికి తనశక్తివంచనలేకుండా కృషిచేస్తానని అన్నా రు. పరిశ్రమలవద్ద తాను డబ్బులు వసూలుచేసే రకంకాదని, తాను నయాపైసాకూడా తీసుకోనని, అవసరమైతే భవానీసాక్షిగా చెబుతున్నాను నేను పరిశ్రమ నిర్వాహకుల వద్ద డబ్బులు ముట్టలేదని స్పష్టంచేశారు. పరిశ్రమలవద్ద డబ్బులుముడితే పొల్యూషన్‌రాదని, డబ్బులుముట్టకపోతే పొల్యూ షన్ వస్తుందని ఎమ్మెల్యే శంకర్ ఎద్దేవాచేశారు. గ్రామంలో కొందరుపోరలు ఉరుకులాడుతుంటా రని, పెద్దలు మీరు వాస్తవాలనుగ్రహించి గ్రామాన్ని అభివృద్ధిదిశగా తీసుకువెళ్లాలని మహిళలకు సూచిం చారు. తప్పుచేస్తే మహిళలు ఎవరైనా ఊరుకోరని, వారిని నిలదీస్తారని, కన్నబిడ్డలైనాసరే పట్టించు కోరని, తప్పునుతప్పుగా ఒప్పునుఒప్పుగా చెప్తారని, గ్రామంలో మహిళలుకూడా యువతను సన్మా ర్గంలో పెట్టాలనిసూచించారు.

## సన్నబియ్యం భోజనం చేసిన ఎమ్మెల్యే



అప్పారెడ్డిగూడెంలో సన్నబియ్యం భోజనం చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

**నందిగామ, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం నుండి ప్రయోగాత్మకంగా రేషన్ షాపుల్లో ప్రవేశపెట్టిన సన్న బియ్యంను సోమవారం అప్పరెడ్డిగూడలో నిరుపేద మహిళ అరుణమ్మ ఇంట్లో సన్నబియ్యంతోవండిన వంటకాలతో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, కాంగ్రెస్‌నాయకులు భోజనంచేశారు. నిరుపేదమహిళ ఆహ్వానాన్ని మన్నించి ఎమ్మెల్యే, కాంగ్రెస్‌ప్రముఖులు భుజించి వంటకాలు అద్భుతంగా ఉన్నా యని అరుణమ్మను అభినందించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లా డుతూ గతప్రభుత్వంలో రేషన్‌బియ్యం తినడం దేవుడెరుగుగాని ఆబియ్యం అటునుంచి అటే అమ్ముకునేవారని, నేడు ఇందిరమ్మపాలనలో ఈ సన్న బియ్యం తీసుకొచ్చుకొని ఆనందంగా పేదలు వండుకొని తింటున్నారని ఎమ్మెల్యే ఆనందం వ్యక్తంచేశారు. భుజించిన వారిలో మాజీ ఎంపిపి ఎం.శివశంకర్‌గౌడ్, ఎంపిడివో సుమతి, మాజీ ఎంపిటిసిలు కొమ్ము కృష్ణ, కుమార్‌గౌడ్, చంద్రపాల్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు జంగ నరసింహులు, పసుల బుచ్చయ్యలు, సట్టి నమాజ్‌రెడ్డి, సీతారాం, సత్యనారాయణగౌడ్, చిందం నర్సింలు, మల్లేష్, చిన్నంతరగారి ప్రభు, ఎం.ప్రభాకర్, ఆనందం, ఉన్నారు.

## క్రీడల్లో రాణిస్తేనే సమాజంలో గుర్తింపు: సిఐ




ఎంపిఎల్‌విజేతలతో సిఐ పరుశురాం, మాజీఎంపిపి సుదర్శన్‌రెడ్డి, పావని

**ఘట్‌కేసర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
యువత చెడువ్యసనాలకు దూరంగా ఉండి క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఘట్‌కేసర్ ఇన్‌స్పెక్టర్ పందిరి పరుశురాం అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ మాదారంలో నిర్వహించిన మాదారం ప్రీమియర్ లీగ్ (ఎంపిఎల్) సీజన్-6 క్రికెట్‌పోటీల ముగింపుకార్యక్రమంలో సిఐవిచ్చేసి మాట్లాడారు. ఈసందర్భంగా ఇన్‌స్పెక్టర్ పరుశురాం, ఘట్‌కేసర్ మాజీ ఎంపిపి ఏనుగు సుదర్శన్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్యయాదవ్‌ల చేతులమీదుగా ఎంపిఎల్ విజేత జట్టుకు ట్రోఫీని అందజేసి క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. గేమ్‌చేంజర్స్ జట్టు విజయంసాధించింది. ఈసందర్భంగా నిర్వాహ కులు విచ్చేసిన సిఐ, మాజీప్రజా ప్రతినిధులు, నాయకులను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కడుపొల్ల మల్లేశ్, డిసిసి కార్య దర్శి ఉల్లి అంజనేయులు, మున్సిపల్ ఉపాధ్యక్షులు కొరుబోతు నాగరాజు, యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బొక్క సంజీవరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ నల్లోళ్ల రవికుమార్, నిర్వాహకులు సాయికుమార్, సందీప్, గణేశ్, ప్రభాకర్, సంతోష్, నరేశ్, నాయకులు మధు, సుదర్శన్, మల్లయ్య, జంగయ్య పాల్గొన్నారు.

## పవిత్ర పుష్కర నదుల పురస్కారాలు

**షాద్‌నగర్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జీవనది ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పవిత్ర పుష్కర నదుల పురస్కారాలు 2025 నిర్వహించారు. ఈకార్యక్రమానికి విశిష్ట అతిథిగా రంగారెడ్డి జిల్లా పరిషత్ స్త్రీ, శిశు సంక్షేమశాఖ స్థాయి సంఘం మాజీ చైర్ పర్సన్, కేశంపేట మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్‌రెడ్డి పాల్గొని మహిళా పురస్కార గ్రహీతలకు పురస్కారాలు అందజేసినట్లు జీవనది ఫౌండేషన్ సభ్యులు పేర్కొన్నారు.

## షాపింగ్ మాల్‌లో ఎమ్మెల్యే సందడి..



లక్కీడ్రా కూపన్ తీస్తున్న తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
తాండూరు పట్టణంలో ప్రముఖ షాపింగ్ మాల్‌లో ఎమ్మెల్యే బి.మనోహర్‌రెడ్డి సందడి చేసారు. శ్రీరామనవమి సందర్భంగా ఆదివారం కుమార్ షాపింగ్ మాల్లో లక్కీడ్రా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ముచ్చటించారు. ఎమ్మెల్యేతీసిన తొలి లక్కీకూపన్ కర్ణాటకకుచెందినవ్యక్తి కారు ను గెలుచు కోవడం విశేషం. ఈలక్కీడ్రాలో 35మంది వివిధబహుమతుల ు గెలుచు కున్నారు. ఈకార్యక్రమంలో కుమార్ షాప్‌యజమాని రమేష్‌గుప్త, నాయకులు ధారాసింగ్, ప్రభాకర్‌గౌడ్, హబీబ్‌లాల, పి.నర్సిములు, బంటు వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాల పరిశుభ్రతతో రోగాలు దరిచేరవు

**-మేడ్చల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షురాలు శైలజాహరినాథ్**



జూనియర్ కళాశాలలో చెత్తను శుభ్రం చేస్తున్న బిజెపి నాయకులు

**మేడ్చల్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులను నివారించగలుగుతామని, అందుకు ప్రతి ఒక్కరు పరిశుభ్రత కోసం పాటుపడాలని మేడ్చల్ మున్సిపల్ బిజెపి అధ్యక్షురాలు శైలజాహరినాథ్ అన్నారు. బిజెపి ఆవిర్భావదినోత్సవం సంద ర్భంగా రాష్ట్ర పార్టీ ఆదేశాలమేరకు సోమవారం బిజెపి మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షురాలు మేడ్చల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఆస్పత్రిలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించి, ముళ్లపొదలు, పెద్ద ఎత్తున పేరుకుపోయిన చెత్తను నాయకులు శుభ్రంచేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్తను పరిసరాల్లో వేయకుండా చెత్తకుప్పల్లో వేయాలని, పిచ్చిమొక్కలను ఎప్పటికప్పుడు శుభ్రంచేయాలని తెలిపారు. పరిసరాల పరి శుభ్రతవల్ల సంక్రమించే వ్యాధులను నివారణ చేయడంతో సంవత్సరానికి సుమారు రూ. 20వేలకోట్లు ఆదాచేయగలుగుతామని తెలిపారు. ప్రజల ఆరో గ్యాన్ని కాపాడటం ద్వారా దేశ అభివృద్ధికి దోహదం చేసుకోగలగుతామన్నారు. ఈకార్య క్రమంలో బిజెపి సీనియర్ ప్రభాకర్‌రెడ్డి, ప్రేమ్‌దాస్, శ్రీకాంత్, శ్రీనివాస్‌గౌడ్, హేమలతారెడ్డి, వెంకటేశ్ ముదిరాజ్, నర్సింగ్‌రావు, బాబు రాజ్, అర్జున్‌బాబు, వంశీధర్‌రెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల వంటావార్పు

**-ఐదునెలల నుంచి వేతనాలు ఇవ్వటంలేదని ఆందోళన**

**శామీర్‌పేట, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
గ్రామపంచాయతీ కార్మికులకు, సిబ్బందికి గత ఐదునెలలనుంచి వేత నాలు ఇవ్వటంలేదని నిరసనలు తెలుపుతూ గ్రామపంచాయతీ ముందు వంటావార్పుకార్యక్రమాన్ని నిర్వహించి ఆందోళన వ్యక్తంచేశారు. సోమ వారం శామీర్‌పేట మండలంలోని మజీద్‌పూర్ గ్రామపంచాయతీ వద్ద పారిశుద్య కార్మికులు, సిబ్బంది నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఐదునెలలనుంచి వేతనాలు అందటంలేదని, దీంతో ఆర్థికంగ ఇబ్బందులపాలు అవుతున్నామని సంబంధిత అధికారులు వెంటనేస్పందించి వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వానికి, సంబంధితఅధికారులకు చిత్తశుద్ధిఉంటే గ్రామ పంచాయతీకార్మికులకు పెండింగ్‌వేతనాలు సకాలంలో ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనిరసన వంటావార్పుకార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్మికులు ఇట్టబోయిన పోచయ్య, కృష్ణ, శంకరయ్య, అర్జున్, కవిత, నర్సమ్మ, లక్ష్మి, అనసూయ, సబితా, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

# రైతుల సమస్యలు పరిష్కరించాలి

**-భారతీయ కిసాన్ సంఘ్ నేతలు**

**షాబాద్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
షాబాద్ మండలవ్యాప్తంగా రైతులు ఎదుర్కొం టున్న విద్యుత్‌సమస్యను అధికారులు పరిష్క రించాలని భారతీయకిసాన్‌సంఘ్ నేతలు డిమాండ్ చేశారు. ఈసందర్భంగా భారతీయ కిసాన్ సంఘ్ షాబాద్‌శాఖ నెలవారి సమావేశాన్ని సోమవారం నిర్వహించి ఆయాసమస్యలపై చర్చించారు. పల్లె ప్రాంతాలలో ఎలక్ట్రిసిటీకి సంబంధించి కిందిస్థాయి లైన్మెన్లు, హెల్పర్లు రైతులకు తీవ్ర ఇబ్బందులు కల్పిస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. భువనగిరి పల్లెలో ఇటీవల గుర్తుతెలియని ఒక వాహనం కరెంటుస్తంభాన్ని ఢీకొని వెళ్లిపోయిం దని, స్తంభం విరిగిపోయిన రెండు రోజుల వరకు కరెంటు సిబ్బంది స్పందించలేదన్నారు. లింగాల ఆంజనేయులు ఇతరరైతులు ఆవిషయం ఎలక్ట్రిసిటీ వాళ్ళకి తెలియజేశారని, లైన్మెన్ ప్రభుత్వవిధానం ద్వారా పనిచేయించుకోవాలనుకుంటే ఆలస్యం అవు తుందికాబట్టి ప్రైవేట్‌లోతొందరగాచేయిస్తా డబ్బులు ఖర్చవుతాయని తెలియజేసి రూ.8100అడిగాడ న్నారు. డిపార్ట్మెంట్‌నుంచి స్తంభాన్ని తీసుకువెళ్లడా నికి ట్రాక్టర్ నాటడానికి జెసిబి చార్జీలు రైతుల చేత కట్టించారు. రైతువద్ద 8100రూపాయలు తీసుకు న్నారు. నాదరకుంట గ్రామంలో ట్రాన్స్ఫార్మర్స్ ఓవర్‌లోడ్ ఉంది. అక్కడతరచూ ఫ్యూజులు కాలి పోవడం వంటి సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సందర్భంగా రైతుల దగ్గర డబ్బులు వసూలు చేసి సంబంధిత వస్తువులు వేస్తున్నారు సర్దార్‌నగర్‌లో ఒకమహిళారైతు కనెక్షన్‌కు చెట్ల కొమ్మలు అడ్డుగా ఉన్నాయి. ఆచెట్లను మీరు తొలగిస్తే సప్లై ఇస్తాం లేకుంటే బంద్‌చేస్తాం అంటున్నారు. అలాగే ఇతర గ్రామాలలో ఎటువంటి అనుభవంలేని ప్రైవేట్ వ్యక్తులచేత కరెంటు రిపేర్లుచేయిస్తున్నారు. అలా రిపేర్ చేసినటువంటి వ్యక్తులు వినియోగదారుల వద్ద డబ్బులు వసూలుచేస్తున్నారు. దామర్లకొల్లి గ్రామంలోని లతాసురేందర్‌రెడ్డి అనేరైతు బోరువద్ద లూజులైన్ ప్రమాదకరంగా ఉంది. ఆమె అధికారు లను ఎంతగా అడిగినప్పటికిని సమస్య పరిష్కారం కావడంలేదు. ఈరకంగా లైన్మెన్లు, హెల్పర్లు కరెంటు వినియోగదారులకు తీవ్రంగా ఇబ్బందులు కల్పిస్తూ డబ్బులు వసూలు చేస్తున్నారు. ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్‌పై సమస్యను పరిష్కరించవలసిందిగా భారతీయ కిసాన్ సంఘ్ డిమాండ్ చేయుచున్నది. ఈసమస్య ఇలానేకొనసాగితే ధర్నాలుచేసి పై అధి కారులకు తెలియజేస్తామని హెచ్చరిస్తున్నాం అని అన్నారు. ఈసమావేశంలో ఈరోజు భారతీయ కిసాన్‌సంఘ్ అధ్యక్షుడు యాదవరెడ్డి జిల్లా కార్య వర్గ సభ్యుడు గిరి డి.సత్యనారాయణరెడ్డి చేగురు వెంకటరెడ్డి పోలారం చంద్రయ్యగౌడ్, అంతిరెడ్డి గూడెం బూరుగుల కృష్ణ, చంద్రబాబు, షాబాద్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ ఎర్రచెరువుకట్టపై బారికేడ్ల ఏర్పాటుచేయాలి



ఎర్రచెరువుకట్టపైన నడుస్తున్న భారీవాహనాలు

**మేడ్చల్, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
మేడ్చల్‌పట్టణంలోని ఎర్రచెరువు కట్టపైన భారీ వాహనాలు నడవకుండా అధికారులు బారికేడ్లను ఏర్పాటుచేయాలని మాజీవార్డుసభ్యుడు రవీందర్ కోరాడు. కట్టపైన పాఠశాల బస్సులు, డిసిఎం వాహనాలు, బోరు బండ్లు, భారీవాహనాలు నిత్యంనడవటంతో కట్ట మీద సిసి రోడ్డు పగుళ్లు ఏర్పడి ధ్వంసమౌతున్నా అధికారులు పట్టించుకోవడంలేదని ఆరోపిం చాడు. ఈ విషయాన్ని మున్సిపల్‌కమిషనర్ నాగిరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా మరో రెండురోజుల్లో బారికేడ్లను ఏర్పాటుచేస్తానని హామీ ఇచ్చారని ఆయన తెలిపాడు.

## దిగబడిన ట్రాక్టర్.. ఇబ్బందిపడ్డ ప్రజలు

**కొందుర్గు, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
కొందుర్గు పట్టణంలోని నవాబ్‌పేటరోడ్డులో ట్రాక్టర్ దిగబడడంతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొన్నారు. మండలకేంద్రంనుంచి నవాబ్‌పేట వెళ్లే రహదారిలో రెండునెలలక్రితం కల్వర్టు నిర్మాణం కోసం కాంట్రాక్టర్ పనులు చేపట్టారు. దీంతో ప్రజలు వెళ్లడానికి ఆరోడ్డు పక్కనుండే తాత్కాలిక రోడ్డును ఏర్పాటుచేశారు. రెండురోజులక్రితం కురిసినవర్షానికి రోడ్డు బురదమయంకావడంతో సోమవారం సాయంత్రం ఆరోడ్డు గుండా వెళ్లిన ట్రాక్టర్‌దిగబడింది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి వాహన దారులు ఇబ్బందుల పాలయ్యారు. చేసేది ఏమీలేక వాహనదారులు అక్కడినుండివెనుదిరిగి తంగళ్లపల్లి, విశ్వనాథ్‌పూర్, చెరుకుపల్లి, గంగన్న గూడ గ్రామాలద్వారా కొందుర్గుకు చేరుకున్నారు. సంబంధితశాఖ అధికా రులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే కల్వర్టునిర్మాణం పూర్తి చేయాలని మండలప్రజలు కోరుతున్నారు.

## కాంగ్రెస్ నాయకుల దాడి అమానుషం

**-సొసైటీ చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి**




కెసిఆర్‌చిత్రపటాలతొలగింపును ఖండించిన సొసైటీచైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి

**శామీర్‌పేట, ఏప్రిల్ 7, ప్రభాతవార్త**
శామీర్‌పేట రైతుసేవా సహకారసంఘం కార్యాలయంపై కాంగ్రెస్ నాయ కులు, కార్యకర్తలు దాడులుచేసి మాజీసిఎం కెసిఆర్ చిత్రపటాలు, ఫోటో లు లేకుండా తొలగించటం దారుణమని అమానుషమని శామీర్‌పేట సొసైటీ చైర్మన్, డిసిఎంఎస్ వైస్‌చైర్మన్ ఆర్.మధుకర్‌రెడ్డి అన్నారు. సోమవారం శామీర్‌పేటసొసైటీపై జరిగినదాడిని చైర్మన్‌తోపాటు వైస్ చైర్మన్ ఎం.ఐలయ్యయాదవ్, పలువురు డైరక్టర్లు, మండల బిఆర్ఎస్ అధ్యక్షులు ఎస్.మోహన్‌రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి సతీష్‌రెడ్డి, పలువురు నాయకులు ఖండించారు. కాంగ్రెస్ కార్యకర్తలు రైతుల ఆస్తిని నష్టపర్చటం, విధ్వంసంచేయటం జరిగిందని అన్నారు. ప్రజాస్వామ్యం లో ఇలాంటిదాడులకు పాల్పడటం ఎంతవరకు సబబు అని, దాడులు చేసిననాయకుల, కార్యకర్తలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని చైర్మన్ మధుకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు.

## నిబంధనలను ఉల్లంఘించిన ప్రైవేట్ హాస్పిటల్‌పై చర్యలు

**-మేడ్చల్ జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ సి.ఉమాగౌరి**




అనుకృష్ణ హాస్పిటల్‌ను సీజ్ చేసి జరిమానాను విధించిన డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సి.ఉమాగౌరి పాల్గొన్న అధికారులు, సిబ్బంది

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్ హాస్పిటల్ (అనుకృష్ణ హాస్పిటల్స్)ను సీజ్‌చేసి 5లక్షల రూపాయల జరిమానా విధించినట్లు, 60రోజులపాటు హాస్పిట్ రిజిస్ట్రేషన్‌ను తాత్కాలికంగ రద్దుచేసినట్లు, యాజమాన్యంపై కేసులు నమోదు చేస్తున్నట్లు మేడ్చల్ జిల్లా డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సి.ఉమాగౌరి తెలిపారు. సోమవారం మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని ప్రైవేట్ హాస్పిటల్ అనుకృష్ణ హాస్పిటల్స్‌ను ఆమె సంబంధిత అధికారులతో కలిసి వెళ్లి తనిఖీలు చేసి పరికరాలు సీజ్ చేసి, జరిమానాను విధించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆమెతోపాటు వైద్య అధికారులు, పోలీసు, రెవెన్యూ అధికారులతో కలిసి ఆహాస్పిటల్‌ను తనిఖీ చేశారు. గడువు ముగిసిన పిసి-పిఎన్‌డిటి సర్టిఫికెట్‌తో సేవలు కొనసాగిస్తున్నారని, నూతన సర్టిఫికెట్ పొందకుండ పాత సర్టిఫికెట్ ఆధారంగానే కొనసాగిస్తున్నారని, తారీఫ్ జాబితా కూడ ప్రదర్శనచేయలేదని, డాక్టర్ల జాబితాలోనూ తప్పుదోవపట్టించే సమా చారం ఉందన్నారు. పిసి-పిఎన్‌డిటి సర్టిఫికెట్ రెన్యూవల్ సంబంధించి తపుడు సమాచారం ఉందన్నారు. సర్టిఫికెట్ రెన్యువల్‌కు సంబంధించి తపుడు నివేధిక సమర్పించారని అన్నారు. అనధికారికంగ అల్ట్రాసౌండ్ యంత్రం వినియోగిస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగ నడుపుతున్నా రన్నారు. పోలీక్లినికల్‌లోనూ అనధికారిక వైద్యప్రాక్టీస్ కొనసాగుతుంద న్నారు. అనుమతులులేకుండా వైద్యసేవలు, లైసెన్స్ పొందిన పారామెడికల్ సిబ్బందిని నియమించనందున ఆహాస్పిటల్‌పై తీవ్రమైనచర్యలు తీసు కోవటం జరిగిందన్నారు. ఇకహాస్పిటల్‌ప్రాంగణంలో వైద్యసేవలు అందిం చకుండ, డయాగ్నోస్టిక్‌పరికరాలు వినియోగించకుండ జప్తుచేసి సీజ్ చేసినట్లు డిఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ సి.ఉమాగౌరి తెలిపారు.

## వైభవంగా శ్రీరాముని పట్టాభిషేకం

**-పాల్గొన్న కీసర ఆర్డీఓ, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు**

**శామీర్‌పేట, ఏప్రిల్ 7, ప్రభాతవార్త:**
దేవరయాంజాల్‌లోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో శ్రీరాముని పట్టాభిషేకం అంగరంగవైభవంగా జరిగింది. సోమవారం శామీర్‌పేట మండలం తూంకుంటమున్సిపాల్టీ దేవరయాంజాల్‌లోని శ్రీసీతారామ స్వామి దేవస్థానం ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా పట్టాభిషేక మహోత్సవం జరిగింది. ఆలయచైర్మన్ పెండెం లక్ష్మీనారాయణ, ధర్మ కర్తలు ఎ.భారతి, ఎన్.హరిగోపాల్, వి.మురళీగౌడ్, జి.హరికృష్ణ, బి. సంజీవరెడ్డి, టి.జగదీశ్‌గౌడ్, అర్చకులు మెంబర్ కె.సీతారామాచార్యుల ఆధ్వర్యంలో శ్రీరాముని పట్టాభిషేకం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్‌నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, కీసర ఆర్డీఓ వెంకట ఉపేందర్‌రెడ్డి, శామీర్‌పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి, జిల్లా ఆర్టీఏ మెంబర్, తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షులు బి.జైపాల్‌రెడ్డి, మున్సిపల్ బిజెపి అధ్యక్షులు పి.నర్సింహ్మారెడ్డి, మాజీధర్మకర్త పి.నర్సింహ్మారెడ్డి, రెడ్డిసంఘం అధ్య క్షులు కె.శశిధర్‌రెడ్డి, నాయకులు బి.జంగారెడ్డి, పలువురు నాయకులు, భక్తులు పాల్గొన్నారు.